స'పోర్టు' లేక కనుమరుగు

- 40 ఏళ్ల చరిత్ర గల సాలగ్రామపురం పోర్ట్ స్కూల్ మూసివేత
- నాడు ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన పాఠశాల
- నేడు స్థానిక పేద విద్యార్థులకు దూరమైన విద్య



ఈ ఏడాది నుంచి పూర్తిగా మూసివేసిన సాలగ్రామపురం పోర్ట్ స్కూల్


పోర్ట్ స్కూల్‌ను మూసివేయద్దంటూ నిరసన తెలుపుతున్న చిన్నారులు(ఫైల్)

తాటిచెట్లపాలెం: సుమారు 45 ఏళ్లకు పైగా చరిత్ర గల ఆ పాఠశాల నేడు జ్ఞాపకంగా మిగిలింది. ఎందరో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉన్న ఏకైక చదువుల బడి. ఎందరో ఉన్నత విద్యావేత్తలను తీర్చిదిద్దిన సరస్వతీ గుడి. ఇక్కడ చదివిన వారు నేడు డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, వ్యాపారవేత్తలుగా, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులుగా పనిచేస్తూ.. దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. ఎంతమందికో విద్యాబుద్ధులు నేర్పి.. ఎందరినో ప్రయోజకులను చేసిన సాలగ్రామపురం పోర్ట్ స్కూల్ నేడు చరిత్రగా మిగిలిపోయింది. కనీసం చూడడానికి.. చూసినా గుర్తుపట్టడానికి కూడా వీలు లేకుండా ఈ పాఠశాల ప్రాంగణం మారిపోయింది.

ఇదీ స్కూల్ చరిత్ర..

సుమారు 1979లో కైలాసపురం సాలగ్రామపురంలో నాటి పోర్టు ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ టి.ఆర్.ప్రసాద్ ఆధునికీకరించిన పోర్ట్ హైస్కూల్ భవంతిని ప్రారంభించారు. అంతకు ముందు నుంచే ఇక్కడ తాత్కాలిక భవనాల్లో పాఠశాల నడిపేవారు. ప్రారంభంలో ఎక్కువగా ఇక్కడ పోర్ట్‌లో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లలు మాత్రమే చదివేవారు. కాలక్రమేణా ఈ స్కూల్‌లో చుట్టుపక్కల గల కాలనీల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు చదవడం ప్రారంభించారు. ఇక్కడి కైలాసపురం, శాంతినగర్, లక్ష్మీనారాయణపురం, సింగాలమ్మపురం, సత్యసాయినగర్, సింహగిరి కాలనీ, వరాహగిరి కాలనీ, గణేష్‌నగర్, వాసుదేవనగర్ వంటి అనేక కొండవాలు ప్రాంతాలకు చెందిన వారి పిల్లలు ఎక్కువగా చదువుకున్నారు. ప్రారంభం నుంచి ఎందరినో ఉన్నత విద్యావేత్తలుగా ఈ పాఠశాల తీర్చిదిద్దింది. మరెందరో పేద విద్యార్థులకు అక్షర జ్ఞానం అందించింది. అటువంటి చరిత్ర గల పాఠశాల నేడు కనుమరుగైంది.

ఇలా ముగిసింది..

జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురంలోని పోర్ట్ ఎయిడెడ్ స్కూల్‌లో మొదట్లో 1 నుంచి 10 వరకు తరగతులు నిర్వహించేవారు. ఐదేళ్ల కిందట ప్రైమరీ(1 నుంచి 5) తరగతులను నిలిపివేశారు. అనంతరం ఏడాదికేడాది ఒక్కో తరగతి అడ్మిషన్లను ఆపివేస్తూ వచ్చారు. చివరిగా ఈ ఏడాది 10వ తరగతిని కూడా నిలిపివేసి పూర్తిగా పోర్ట్ హైస్కూల్‌ను మూసివేశారు. కై లాసపురం చుట్టుపక్కల గల సుమారు 30–40 కాలనీలకు ఏకైక ప్రభుత్వ పాఠశాల ఇదే. ఈ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు లేవు. సర్కారు బడిలో తమ పిల్లలను చదివించాలంటే జాతీయ రహదారి దాటాల్సిందే. ఎటైనా కనీసం మూడు నాలుగు కిలోమీటర్లు వెళ్తే గానీ మరో ప్రభుత్వ పాఠశాల లేదు. ఈ సమస్యను పోర్టు యాజమాన్యం గాని, ప్రభుత్వం గానీ పట్టించుకోలేదు. పోర్ట్ స్కూల్‌ను కొనసాగించాలని ఎందరో ఎన్నో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. పోర్ట్ యాజమాన్యం కరుణించలేదు. దీంతో స్థానిక పేదలు తమ పిల్లలను దూరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించుకున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి 45వ వార్డులో అందరికీ అందుబాటులో ఒక ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'శిశు ఆధార్'


శిశు ఆధార్ నమోదు చేస్తున్న విజయలక్ష్మి, షేక్ ఫరీద్

కంచరపాలెం: గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం టీచర్ టి.విజయలక్ష్మి పర్యవేక్షణలో శిశు ఆధార్ ప్రాజెక్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎస్‌సీ సెంటర్ సిబ్బంది షేక్ ఫరీద్ చిన్నారులకు ఆధార్ గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియ చేపట్టారు. సుమారు 125 మంది పిల్లలకు పేర్లు, వివరాల నమోదు, దిద్దుబాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కంచరపాలెం పరిధిలో చిన్నారులకు ఆధార్ నమోదు చేసుకోవాలని తల్లిదండ్రులకు విజయలక్ష్మి సూచించారు. బి.కుమారి, కంచరపాలెం పాఠశాల సిబ్బంది, ఆర్పీ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో భద్రత తప్పనిసరి

మల్కాపురం: విధి నిర్వహణలో ప్రతి కార్మికుడు భద్రత పాటించాలని సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఎం. వెంకట శేషమ్మ అన్నారు. హెచ్‌పీసీఎల్‌లో గురువారం జరిగిన భద్రత అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిటైర్డ్ జిల్లా జడ్జి, పర్మినెంట్ అదాలత్ పబ్లిక్ యుటిలిటీ సర్వీస్ చైర్మన్ వల్లభనాయుడు తదితరులు కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

క్లుప్తంగా

ధ్యాన మందిరంలో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న భక్తులు, పేదలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం కాగడా హారతి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం సుమారు 400 మందికి ప్రత్యేక అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సంధ్యాహారతి, పల్లకీ సేవ, బాబా భజన కార్యక్రమాలు జరిగాయి. ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యార్థిని అదృశ్యం


హారిక

మర్రిపాలెం: ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న ఓ బాలిక అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బల్లాడ హారిక అనే విద్యార్థిని తన తల్లి, అమ్మమ్మ, మేనమామతో కలిసి కంచరపాలెం గంగన్ననగర్‌లో నివసిస్తోంది. ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 23న ఉదయం 8.30 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, ఇంతవరకూ తిరిగి చేరుకోలేదు. అన్ని చోట్లా వెతికారు. బంధువులు, స్నేహితులకు, కాలేజీలో ఇలా అందరినీ అడిగినా హారిక రాలేదని వారంతా చెప్పడంతో విద్యార్థిని మేనమామ సాడి హరీష్ ఈ నెల 24న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్. భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ వి.వెంకటరమణ కేసు దర్యాప్తు చేపట్టారు. హారిక 5 అడుగుల ఎత్తు, తెలుపు రంగు ఛాయతో ఉంటుంది. బాలిక ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు నలుపు రంగు చుడీదార్ వేసుకుని ఉంది. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.

ఆర్పీల సమస్యలపై సమావేశం


ఆర్పీలతో మాట్లాడుతున్న శ్యామలదీపిక

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురంలోని సామాజిక భవనంలో గురువారం వార్డు ఆర్పీలతో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక సమావేశం నిర్వహించారు. ఆర్పీల ప్రధాన సమస్యలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో గంజాయి తాగే వారితో ఎక్కువగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని నియంత్రించాలని పలువురు ఆర్పీలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని తన తండ్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని శ్యామలదీపిక హామీ ఇచ్చారు.

రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలి


బాపూజీనగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ గంకల కవిత సూచించారు. బాపూజీనగర్, శివలింగపురం, శ్రీనివాస్‌నగర్, ఇందిరానగర్, పల్నాటి కాలనీ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రోడ్డు పనులను గురువారం సచివాలయ సిబ్బంది, వార్డు నాయకులు గంకల అప్పారావు, మహేష్ తదితరులతో కలిసి ఆమె పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులను జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ సూచించారు.

పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

- వివిధ ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు


ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న కిషోర్


కప్పరాడ స్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సీతంపేట: శిక్షా సప్తాహ్ డే–4లో భాగంగా గురువారం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పద్య పఠనం, దేశభక్తి గీతాలాపన, భరతనాట్యంతో అలరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు టీడీపీ 26వ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్ చేతుల మీదుగా నోట్ పుస్తకాలు, పెన్నులు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీనరస, ఉపాధ్యాయులు ఎం.వి.ధర్మారావు, ఎం.ఎస్.వి.విశ్వనాథం, నిర్మల, పద్మలత, మాణిక్యం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్కిట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ కప్పరాడ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. థింసా నృత్యం, 'డ్రగ్స్–అపరిచిత వ్యక్తులు' అనే స్కిట్లను విద్యార్థులు ప్రదర్శించి అలరించారు. ఉపాధ్యాయులు జ్యోతి, కుసుమకుమారి, యు.కల్యాణి తదితరులు సాంస్కృతిక కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పౌర గ్రంథాలయంలో చైనా సినిమా ప్రదర్శన



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'ది పోస్ట్‌మ్యాన్ ఇన్ ద మౌంటైన్' అనే చైనా సినిమాను ఇంగ్లిష్ సబ్ టైటిల్స్‌తో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భారతదేశం తర్వాత చైనాకు స్వాతంత్ర్యం వచ్చినా, అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందన్నారు. సినిమా పరిశ్రమలో కూడా మంచి అభివృద్ధి సాధించిందన్నారు. ది పోస్ట్ మ్యాన్ సినిమాలో మానవ సంబంధాలు, అనుబంధాలకు, జీవన విధానంతోపాటు పర్వత ప్రాంతాల్లో చైనా ప్రజల జీవితం కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉషారాణి, ఎస్.విజయకుమార్, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబురెడ్డి, బాబ్జి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ హెచ్‌టీ లైన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, పలు నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, రామచంద్రనగర్, టిడ్కో కాలనీ, సంతోషిమాత కాలనీ, ముస్లిం తాటిచెట్లపాలెం, పుట్ట బంగారమ్మ గుడి ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆశీలమెట్ట సెక్షన్‌లో..

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ టీపీటీ కాలనీ, 11 కేవీ బీఎస్ లేఅవుట్, 11 కేవీ సీతంపేట ఫీడర్లలో మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టీపీటీ కాలనీ, సీతంపేట, విజయ మెడికల్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, సీతమ్మధార ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఇందిరానగర్ ఫీడర్‌లో..

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇందిరానగర్ 1–5, తిక్కవానిపాలెం, జయప్రకాష్‌నగర్, సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..

జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి 11 కేవీ ఎఫ్‌సీఐ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు భాస్కర్ గార్డెన్స్, ఎఫ్‌సీఐ పార్కు, శివనగర్, రామాలయం వీధి, మర్రిపాలెం వుడా లేఅవుట్, శివశివాని స్కూల్ రోడ్డు, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎన్ఎస్‌టీఎల్ పరిధిలో..

మర్రిపాలెం: జోన్–2 ఎన్ఎస్‌టీఎల్ పరిధిలోని 11 కేవీ కళింగనగర్, శాంతినగర్ ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కళింగనగర్ ఫీడర్ పరిధిలోని మాధవ స్వామి టెంపుల్ రోడ్డు, గడ్డప్ప ఎన్‌క్లేవ్, కళింగనగర్.. శాంతినగర్ ఫీడర్ పరిధిలో అంబేడ్కర్ నగర్, శాంతినగర్, నేతాజీనగర్, గురజాడనగర్, ఎన్ఏడీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం


కంచరపాలెం రైతుబజారు వద్ద నిరసనలో మాట్లాడుతున్న బొట్టా ఈశ్వరమ్మ

కంచరపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సీపీఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. కంచరపాలెం బీఎస్ఆర్ భవన నుంచి దేవేంద్రనగర్, రెడ్డి కంచరపాలెం, దుర్గానగర్, జాషువానగర్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి కంచరపాలెం రైతుబజారు వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలకు వరాలు, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపేలా కేటాయింపులు ఉన్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక సహకారం అందిస్తారని కార్మికులు వేయి కళ్లతో ఎదురు చూస్తే.. ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధికి రూ.15,000 కోట్లు కేటాయించడం అబద్ధమని, అప్పు తెచ్చుకోవడానికి హామీగా ఉంటామని మాత్రమే చెప్పారన్నారు. ప్రభుత్వం, పచ్చ మీడియాలు వాస్తవాలు చెప్పకుండా ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. ఏపీకి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కావడానికి కావలసిన నిధుల గురించి, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు కేటాయించలేదని తెలిపారు. ఈ బడ్జెట్‌ను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జోన్ నాయకులు ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, బి.ఎస్.చలం, బి.అప్పారావు, శంకరరావు, కుమారి పాల్గొన్నారు.

మర్రిపాలెం రైతుబజారును సందర్శించిన డీఎస్‌వో


రైతుబజారులో స్టాళ్లను పరిశీలిస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాశ్

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజారును గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి సూర్యప్రకాశ్ సందర్శించారు. బజారులో ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం స్పెషల్ కౌంటర్‌లో విక్రయాలను అడిగి తెలుసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్నందున, వినియోగదారుల సౌలభ్యం జిల్లాలోని అన్ని రైతు బజార్లలో స్పెషల్ కౌంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. వీటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.181 ఉంటే, రైతుబజారులో రూ.160కే అందిస్తున్నట్లు చెప్పారు. రోజు వారీ అమ్మకాలు, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. డీఎస్‌వో వెంట సర్కిల్–2 ఏఎస్‌వో, ఆర్ఐ కోమలి, రైతు బజారు ఈవో కొమ్మనాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలి

- పారదర్శకంగా సమస్యలు పరిష్కరించాలి
- పోలీసులకు సీపీ శంఖబ్రత బాగ్చి సూచన


పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పెందుర్తి: సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఫిర్యాదులతో వచ్చిన ఇరు పక్షాల వాదనలు విని..తగిన విచారణ చేసి సమస్య పరిష్కరించాలన్నారు. గురువారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను వేయకుండా అక్కడ మొక్కలు నాటాలన్నారు. సిబ్బంది ఎవరు ఏ విధులు నిర్వర్తిస్తున్నారో ప్రజలకు తెలిసే విధంగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్టేషన్‌లో సిబ్బంది నిర్ణీత సమయానికి..పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని..పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. రిజిస్టర్లు రోజువారీ అప్డేట్ ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి ఏ సమస్యలు ఉన్నా చెప్పాలన్నారు. సిబ్బందికి కుటుంబ పరంగా, వృత్తి పరంగా ఏ సమస్య ఉన్నా 79950 95799 నంబర్‌కు తెలియజేయాలన్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ విభాగం అధికారులకు ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టే విధంగా ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలను నిశితంగా పరిశీలించాలన్నారు. గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైన ప్రతీ చోట సీసీ కెమెరాల ఏర్పాటు తప్పసరిగా చేయాలని ఆదేశించారు. విధుల నిర్వాహణలో ఎవరు బాధ్యతారహితంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. 32 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి ఈ పూజలో పాల్గొనవచ్చు. ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

27వ వార్డులో బీసీజీ టీకాలు


వైద్యురాలు శ్రావణి పర్యవేక్షణలో బీసీజీ టీకాలు వేస్తున్న సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులోని ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)లో బీసీజీ టీకాలు వేశారు. వైద్యురాలు శ్రావణి పర్యవేక్షణలో ఏఎన్ఎంలు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని స్థానికులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


జాతీయ రహదారిలో గోతులు


సత్యం జంక్షన్–గురుద్వారా రహదారిలో ఏర్పడిన గోతులు


హైవేలో గురుద్వారా వద్ద పాడైన రోడ్డు

సీతమ్మధార: జాతీయ రహదారిపై మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్, గురుద్వారా కూడలికి వెళ్లే మార్గం గోతులమయమైంది. హైవేలో రెండు వైపులా గోతులు ఏర్పడటంతో రాకపోకల సమయంలో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళలో ద్విచక్ర వాహన చోదకులు ఈ రోడ్డులో ప్రయాణించేందుకు భయపడుతున్నారు. హైవే కావడంతో భారీ లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రహదారులు ఛిద్రంగా మారాయి. కాంట్రాక్టర్‌లు చేస్తున్న పనులను జీవీఎంసీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో రోడ్లు పాడవుతున్నాయి. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రహదారి గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు తగు తీసుకోవాలని పలువురు స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

వార్డుల పరిశుభ్రతకు ప్రాధాన్యం


టౌన్ కొత్తరోడ్డు వద్ద చెత్త వేసే ప్రాంతాలను పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: వార్డులన్నీ ఎక్కడా చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ 35వ వార్డులో పర్యటించి చెత్త వేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. బౌడారా రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త వేస్తున్న కారణంగా అక్కడ అపరిశుభ్రంగా ఉండటంతో వెంటనే పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. టౌన్ కొత్త రోడ్డులోని జీఎస్ఎన్ శాస్త్రి రోడ్డులోని టింబర్ డిపోలున్న ప్రాంతాన్ని పరిశీలించి రహదారిపై ఉన్న దుంగలు తీసేసి పారిశుధ్యానికి సహకరించాలని వ్యాపారులను కోరారు. లేని పక్షంలో అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు. ప్రతిరోజు సిబ్బంది పర్యవేక్షించి పారిశుధ్యంపై రిపోర్టు ఇవ్వాలన్నారు. అనంతరం జనతా బజార్, మున్సిపల్ స్టేడియం, వెలంపేట పోస్టాఫీసు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాల నేపథ్యంలో రహదారులు, కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మురుగు నీరు బయట ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

28న ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్వం హాస్పిటల్స్ సహకారంతో ఈ నెల 28న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే శిబిరంలో సాధారణ వైద్య నిపుణుడు డాకటర్ నితేష్ నేమాని, గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణుడు డాక్టర్ ఎస్‌కే జమీర్ అహ్మద్, ఎముకలు, కీళ్ల వ్యాధుల నిపుణుడు డాక్టర్ పీవీవీ సత్యనారాయణరెడ్డి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. డయాబెటిస్, రక్తపోటు, ఈసీజీ పరీక్షలు చేస్తారని, మురళీనగర్ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.